


# ఆరని దీపాలు

శ్రీ ద్విభాష్యం

దీపావళీ శుభరాత్రి.

పూజామందిరంలో కూర్చుని వందదీపాలు వెలిగించింది లత.

ఆ వంద దీపాల కాంతిలో తన శరీరాన్ని తనే ఒకసారి చూసుకుంది.

అప్పుడే కట్టుకున్న కొత్త పట్టుచీర ధగధగా

# ఉచితము!

## అమూల్ బేబీ పుస్తకము



అమూల్ బేబీ పుస్తకము ఇప్పుడు ఉచితంగా తల్లులకు ఇవ్వబడుతుంది. గర్భధారణ, ప్రసవానికి ముందర జాగ్రత్త. ప్రసవము, తల్లి పాలు, ఇతర ఆహారములు. మిశ్రమ ఆహారమును అలవాటు చేయుట. పిల్లవాని దినచర్య. పిల్లవాని అభివృద్ధి. జబ్బులను అరికట్టుట. ప్రథమ చికిత్స. పసితనమందలి సాధారణ రోగములు మరియు జబ్బుతో నున్న పిల్లవాని యొక్క సంరక్షణను గురించి వాస్తవికమైన అధ్యాయములు గల ఈ 48 పేజీల పుస్తకము సులభశైలిలో అగ్రగణ్యుడైన ఒక స్పెషలిస్టుచే వ్రాయబడినది.

ఈ క్రింది కూపన్‌ను నింపి
పోస్ట్ బ్యాగ్ 10124,
బొంబాయి-1కు,
ఖర్చుల నిమిత్తమై
50 పైసల స్టాంపులతో పంపండి.

పోస్టు బ్యాగ్ 10124కు, బొంబాయి-1
తెలుగులో వ్రాయబడిన అమూల్ బేబీ పుస్తకము యొక్క ప్రతిని ఉచితంగా నాకు పంపండి

స్పష్టమైన పెద్ద అక్షరములలో పేరు మరియు ఎడ్రెస్
______________________
______________________
______________________
______________________
______________________

TL 102

ASP/AMF/AB TEL


మెరుస్తూంది.

మెడలోని బంగారుహారం కళ్లకు మిరుమిట్లు గొలుపుతూంది!

పట్టురవిక చేతుల దిగువన రెండు దండలమీదా రెండు బంగారువంకీలు మిలమిలా మెరుస్తున్నాయి.!

తన అలంకారం తనకే చిరాకు కలిగించింది!

కాని, అది అతని ఆజ్ఞ!

ఆజ్ఞకాదు, కోరిక!

అతను కళారాధకుడు!

అతని కళారాధనలో తానెప్పుడూ అతనికి అడ్డు రాలేదు! అదే తన జీవిత పరమార్థం!

అతని కళారాధనే తనను అతనివద్ద కాకర్షించింది! అతని సౌందర్యాన్వేషణే తనని తన కన్నవారికికూడా దూరంగా ఉంచింది!

లోకంలో అతనిలాటి వాళ్లెక్కడా ఉండరు. రెండు రోజులనించి ఏ ఆహారమూ తీసుకోకుండా అతి నీరసంతో బాధ పడుతున్నా, వెన్నెముకలో నొప్పి అతన్ని అడుగడుగునా వేధిస్తున్నా ఈ దీపావళికూడా కిందటి దీపావళిలాగే జరగాలని పట్టు పట్టేడు! తనచే కొత్త పట్టుచీర కొనిపించాడు! కిందటి దీపావళికి వెలిగించినన్ని దీపాలూ వెలిగించమని బ్రతిమాలుకున్నాడు.

మంగళసూత్రాలు రెండూ చేతుల్లోకి తీసుకుని ఎదురుగానున్న వేంకటేశ్వరుని పటంవద్దకు వెళ్లింది లత.

నూటఒకటవ దీపం ఆ పటంముందు నిశ్చలంగా వెలుగుతూంది!

తన మనసులోని ఆవేదన ఆ పరమేశ్వరునికి చెప్పుకుంది. మనసులోనే ఆయనతో ఒక పందెం వేసింది.

"తెల్లవార్లూ నీవద్ద ఈ దీపం వెలిగేలా చూసే బాధ్యత నాది! రాబోయే మూడువందల అరవయ్యైదు రోజులూ నా ఇంటిని నిత్యమంగళంగా ఉంచే బాధ్యత నీది!"

తన పందెం ఒప్పుకున్నట్లు చిన్నగా నవ్వేడు ఆ వేంకటేశ్వరుడు! తృప్తిగా ఆయనవంక చూసింది. రెండుకళ్లనుండి రెండు కన్నీటిబిందువులు జారి ఆ మంగళసూత్రాలను తడిపాయి!

వెలిగించిన దీపాలన్నీ డాబా గోడలమీద అమర్చుతూంది లత. కిందటి దీపావళిరాత్రి లీలగా ఆమె కళ్లముందు మెదిలింది.

ఆ రోజు రాత్రి అతను వీణపై మోహనరాగవర్ణం పాడేడు. ఈ డాబామీదే, ఈ దీపాలమధ్యనే సిల్కు కంబళీమీద కూర్చుని చక్కగా వీణపాట పాడేడు. తను దీపాలు పెట్టడంలో నిమగ్నురాలయిఉన్నప్పుడు చప్పుడుకాకుండా వీణ తెచ్చి మోహనంగా వీణ మీటి, తను తుళ్లిపడేలా చేశాడు!

ఆ తరవాత తనను కళ్యాణిరాగంలో ఓ పాట పాడమన్నాడు. తనకు కళ్యాణిరాగం బాగా ఇష్టమని అతనికి తెలుసు.

హిందోళరాగంలో అతను చేసిన పాట పాడుతూ చిన్నగా తను నాట్యంచేస్తూంటే వీణపై తన ననుసరించాడు. నాట్యంచేస్తూ, ఆ వీణానాదంలో లీనమై తను అడుగు వెయ్యలేకపోయింది. తను ప్రయత్నించిన ఒక భంగిమలో అలానే నిలబడి,

ఉండడం మంచిదంటున్నారు డాక్టరుగారు. ఆ వైద్యసే ఈ రోగాన్ని కొంతవరకున్నైనా దారిలోకి తీసుకురావచ్చునని ఆయన అభిప్రాయం. ఆమె పురిటికికూడా అక్కడ సదుపాయంగా ఉంటుందన్నారు. అక్కడి డాక్టరుగారు మన డాక్టరుగారికి మంచి స్నేహితులట! మీ అంగీకారం తెలియపరచమన్నారు. ఈ రోగంతో మోహన్‌గారు చాలారోజులనుండి బాధపడుతూ ఉండిఉండాలి అన్నారు డాక్టరుగారు. రెండులంగ్సూ ఎఫెక్ట్ అయ్యాయట!”

“అవును. ప్రకృతివైద్యమే కొంతవరకూ పని చెయ్యచ్చు. కాని వాళ్ల చాలా యాతనపెడతారేమో! మరే మార్గమూ కనిపించడంలేదు. నేనే వెళ్లి డాక్టరుగారిని కలుసుకుంటాను. నువ్వు వెళ్లచ్చు. ఈ విషయం వాళ్లిద్దరికేగాదు, మరెవ్వరికీకూడా తెలియకూడదు! జాగ్రత్త! మరే విద్యార్థికీకూడా తెలియకూడదు!”

భయంగా అక్కణ్ణించి వెళ్లిపోయాడు ఆ విద్యార్థి!

“ఇంక నా మోహన్ నాకు దక్కడు. ఇంత అనుభవజ్ఞుణ్ణి అయికూడా అతని ఆరోగ్యాన్ని గురించి ఒక్కరోజూ ఆలోచించలేకపోయాను!” ప్రిన్సిపాల్‌గారు దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు.

* * *

ప్రకృతిఆశ్రమానికి బయల్దేరేముందు పూజామందిరంలోకి వెళ్లి మౌనంగా రెండునిమిషాలు ఆ వేంకటేశ్వరుని పటంముందు నించుంది లత.

‘ఆయన ఏ రోగంతో బాధపడుతున్నారో ఎవ్వరూ చెప్పడంలేదు. నీవైనా చెప్పు, ప్రభూ! ఆయన బాధలో నేను సగం పంచుకునే శక్తి నాకు ప్రసాదించు. త్వరలోనే ఆయనకు స్వస్థత చేకూర్చు. మంగళసూత్రంతో మళ్లీ నీ దర్శనం చేసుకునే భాగ్యం ప్రసాదించు, దేవా!’ అని మనసులోనే ప్రార్థించుకుంది.

మోహన్ లేకపోతే ఇల్లంతా బావురుమన్నట్లుంది. మోహన్ ఇంట్లో ఉన్నప్పుడు ఇంత పెద్ద ఇల్లూకూడా. చాలా చిన్న ఇల్లులా కనిపించేది. అతనంత నిండైన మనిషని ఇప్పుడు మరీ ఎక్కువగా తెలుస్తూంది! ఈ ఇంటిని విడిచి మూణ్ణెల్లు ఆశ్రమంలో ఎలా గడపాలో ఏమో!

ఇల్లంతా భరించరాని నిశ్శబ్దతలో నిద్రపోతూంది. అక్కడ ఒక్క క్షణం ఉండ బుద్ధికావడంలేదు! అయినా ఆ ఇంటిని విడిచి వెళ్లడాని కేదోలా ఉంది. ఎందుకో చెప్పరాని కలవరంతో మనసు బాధపడుతూంది. మోహన్‌తో వచ్చేసేటప్పుడు పుట్టింటిని వదిలి రావడానికికూడా తన మనసంత కలవరపడలేదు!

చిందరవందరగా కావలసినవేవో ఓ పెట్టెలో సర్దుకుంది లత. పెద్దపెట్టున గాలి వీచింది. “నేనో!” అంటూ మూలిగింది మూలనున్న వీణ!

షెల్ఫులో పుస్తకాలన్నీ కిందపడిపోయాయి!

అతను రాసిన ఆ పుస్తకాల్నీ, వీణనికూడా తనతో తీసుకువెళ్లింది లత!

* * *

మనసులోని బాధ ఎవరికేనా చెప్పుకుంటేగాని తగ్గదు! అందరికీ చెప్ప బుద్ధివెయ్యదు. వినేందుకు ఆప్తులుండాలి! ఆప్తులు లేనివాళ్లకి ఆ పరాత్పరుడే ఆప్తమిత్రుడు! నోటితో చెప్పుకోడం అలవాటులేదు. మోహన్‌కి! కలం, కాగితం తీశాడు.

“ప్రభూ! నిన్ను ధనధాన్యాలు కోరుకోవడంలేదు. మరే విద్యలూకూడా కోరుకోవడంలేదు. డాక్టరిచ్చిన మూడునెలల గడువునీ నీవు మరో నెల పొడిగిస్తే చాలు!

కళారాధనకు నాకు కావలసిన సాధనాన్ని లత రూపంలో నాకు ప్రసాదించావు. ఆమెలోని ప్రతి చలనమూ నాచే ఒక్కొక్క కళాఖండాన్ని సృష్టింపజేసింది. నే నందుకున్న ఇన్ని ప్రశంసల వెనకాల నిర్మలమైన ఆమె రూపం కనిపిస్తుంది.

ముచ్చటైన ఈ మూడేళ్ల స్నేహంలోనూ జీవితసుఖాల్లోని పరాకాష్టల ననుభవించగలిగాను. ఒకే ఒక అనుభవం పొందలేకపోయాను. అదే, తండ్రిగా బ్రతకడం! ఆ కోరికకూడా తీర్చేవాడిలా కనిపించి, ఈ భయంకరమైన రోగాన్ని నా పరం చేశావు.

నే రాస్తున్న కడపటి నవల సగంలో ఆగిపోయింది. నిండుచూలాలిగా లతను చూసి, ముచ్చటగా ఆమెను కొన్ని విషయాలడిగి, ఈ నవలని సుఖాంతం చెయ్యాలని ఆశపడ్డాను. ఇప్పుడు నన్ను కాగితం, కలం ముట్టుకోనివ్వదు లత! నేనేమైనా అడిగినా కూడా చెప్పదు. మా ఇద్దరిమధ్యా రహస్యాలేవీ ఉండకూడదని ఒకరి కొకరు ప్రమాణం చేసుకున్నాం. ఇప్పుడు నా రోగం విషయం ఆమె కెలా చెప్పాలో అర్థంకాకుండాఉంది! నా విషయం తెలిస్తే ఆమె జీవించలేదు!

నా ప్రాణంగురించి నే బాధపడడంలేదు, ప్రభూ! లత ముఖాన్న ఉన్న బొట్టు చూస్తే, నిష్కళంకమైన ఆమె ముఖాన్ని చూస్తే నీతో యుద్ధం చేసైనాసరే ఈ భూమిమీద బ్రతకాలని ఉంది.

ఆమె ఉత్త అమాయికురాలు! ఆమెకెంత అన్యాయం జరగడం నే సహించలేను. ఆమెకు కోరికలు లేవు. తన మనసులో ఒకేఒక కోరిక ఒకనాడు బయటపెట్టింది. నువ్వు మహానుభావుడవు. ఆ కోరిక నెలాగో తెలుసుకున్నావు. గర్భవతిగా ఉన్నందుకు ఆమె ఎంత గర్వపడుతూందో నాకు తెలుసు. తన బిడ్డను చూసుకొని ఆమె ఎలా మురిసిపోతూందో కళ్లారా చూసి ఆనందిద్దామని ఉంది. అందుకే ఈ కోరిక కోరుకుంటున్నాను. డాక్టరిచ్చిన గడువును మరొక్క నెల పొడిగించు, ప్రభూ! ఇది నువ్వు చెయ్యలేని పనికాదు.చేస్తావనిధైర్యంతోనేప్రాధేయపడుతున్నాను!”

* * *

ఏదో పీడకలలోంచి మెలకువ తెచ్చుకుంది లత. పక్కమంచంమీద మోహన్ కూర్చుని ఉండడం సహించలేకపోయింది. తను లేవడం అతను గమనించలేదు. భరించరానిబాధ అణుచుకుంటూ మెల్లిగా మూలిగాడు.

అతనంతవరకూ ఏ నవలో రాస్తూ ఉండి ఉంటాడని తెలుసుకుంది లత! లేచి అతనికి దగ్గిరికి వెళ్లింది.

“ఏం, బాధ ఎక్కువగా ఉందా? పాపిష్టిదాన్ని ఏమరిచి నిద్ర పోతున్నాను మీ బాధను ఏ మాత్రమూ పంచుకోకుండా!”

ఆమె ఆప్యాయత అతని బాధని తగ్గించింది. అతను కనుకొలకుల్లో రెండు నీటిబిందువులు చేరాయి!

నాకు చాలాసేపయి మెలకువ వచ్చింది. లతా! ఎందుకో తెలియదు జీవితంపై—మొదటిసారిగా విరక్తి కలిగింది. నే రాసిన పుస్తకాలన్నీ చింపేద్దామనుకున్నాను. నా వీణని పగలకొట్టేద్దాం మనుకున్నాను! అమాయికంగా నిద్రించే నీ ముఖంలోకూడా ఏ అందమూ చూడలేకపోయాను. నన్ను క్షమించు లతా! నా కళారాధనను నేనే దూషించుకున్నాను. నాలోని కళాకారుడు చచ్చిపోయాడేమోనని భయంగా ఉంది!”

“అది అసంభవం! కళాకారుడు కాని మోహన్‌ని, నేను ఊహించుకోలేను. జరిగిన ఈ చిన్న పొరపాటు మరిచిపోండి. మనసు పాడుచేసుకోకండి. నా మీద దయఉంచి విశ్రాంతి తీసుకోండి.”

“లేదు లతా! నాలో కళారాధకుడు చచ్చిపోలేదు. నా కళారాధన ఏ మాత్రం తగ్గుముఖం పట్టలేదు. ఇదిగో చూడు. మరో పదిరోజుల్లో ఈ నవల పూర్తిచెయ్యబోతున్నాను. నీ బంగారుపాపను నువ్వు చూసి మురిసిపోతూంటే, నిన్ను చూసి ఆనందించి, ఆ అనుభవాన్ని ఈ నవలలో గుప్పించి దీన్ని సుఖాంతం చెయ్యాలనుకుంటున్నాను.”

ఆమెకళ్లనుండి ఆనందభాష్పాలు రాలేయి.

“మీ కళారాధనే నా కెంతో ధైర్యాన్నిస్తూంది. నా పురిటిని గురించి నా కెంతైనా భయంగా ఉంది!” అతని చేతుల్లో తల దాచుకుంది.

“భయపడకు లతా! మనకొక చక్కని బాబు పుడతాడు. బాబుకడుపులో ఉన్నప్పుడు నువ్విలా విచారంగా గడపకూడదు. లే లతా! వీణ ఒళ్లోకి తీసుకో! శ్రావ్యంగా ఓ పాట పాడు.”

అతని మనోవ్యాధి లత ఎప్పుడో అర్థం చేసుకుంది. తనకా విషయం తెలిసినట్టు మాత్రం అతనికి తెలియకూడదు. అందుకే అతని మాట కాదనేశక్తి ఆమెలో లేకపోయింది. అర్ధరాత్రివేళ మెలకువగా ఉండడం ప్రకృతి ఆశ్రమంలో చేయకూడని పని!

అయినా, అతని కోసం, ప్రకృతిసూత్రాల్నికూడా ఉల్లంఘించాలి!

వీణ ఒడిలోకి తీసుకుంది. అతనే రాసిన ఒక విషాదగీతం వీణపై పాడింది లత!

ఏ పుస్తకాల్నీ, ఏ వీణనూ, ఏ భార్యనూ కొద్దిక్షణాలక్రితం అసహ్యించుకున్నాడో అవే అతని శరీరబాధ మరిపింపజేశాయి. అనుకోకుండానే నిద్ర పట్టింది.!

* * *

గణగణమని మ్రోగింది ఫోను. రిసీవరు ఎత్తారు ప్రిన్సిపాల్‌గారు.

“హలో! ప్రిన్సిపాల్‌గారేనా?” అంది అవతల కంఠం.

“అవును.”

“ప్రకృతిఆశ్రమం, నుంచి మాట్లాడుతున్నాను. లతగారికి నొప్పులు మరీ ఎక్కువయ్యాయి. కొద్దినిమిషాల్లో పురుడు రావచ్చు. చాలా బాధ పడుతున్నారు మీరిక్కడ ఉండడం చాలా అవసరం.”

“వెంటనే బయల్దేరి వస్తున్నాను.”

ఆత్రంగా అక్కడికి బయల్దేరారు ప్రిన్సిపాల్‌గారు.

* * *

ప్రిన్సిపాల్‌గారి కారు ప్రకృతి ఆశ్రమంలో ఆగింది.

ఆశ్రమం అంతా అలజడిగా ఉంది. ఆత్రంగా మోహన్ గదికి పరిగెత్తారు. ప్రకృతిడాక్టరు, మధుబాబు ఆయున్న దారిలో ఆపుచేశారు. "మగపిల్లవాడు పుట్టేడట. ఆమె పరిస్థితి చాలా ఆందోళనకరంగాఉంది."

ఇద్దరూ మోహన్‌గదివైపు నడిచారు.

నీరసంగా మంచంమీద కూర్చున్న మోహన్‌చుట్టూ నలుగురైదుగురు విద్యార్థులున్నారు.

ప్రిన్సిపాల్‌గారిని చూస్తూనే అంతా ఆత్రంగా ఆయనకేసి చూశారు. లేని ఓపిక తెచ్చుకుని వింటున్నాడు మోహన్!

దగ్గిరికి వచ్చిన ప్రిన్సిపాల్‌గారిపై వాలిపోయాడు. "మాకు మగబిడ్డ పుట్టాడు మేస్టారూ. మగబిడ్డే పుట్టాడు. అంతా మీ ఆశీర్వచనం!" రక్తపుచుక్కలేని అతనికళ్లు రెండే రెండు కన్నీటిచుక్కలతో తడిశాయి.

"మీరు వస్తేగాని నా బిడ్డను నాకు చూపించనన్నారు. రండి మేస్టారూ. నా బాబుని నేను వెంటనే చూడాలి!"

"నువ్వక్కడికి రాలేవు. నీ బిడ్డ నిక్కడికే తీసుకువస్తామండు." లతవిషయం అతనికి తెలియకుండా ఉంచుదామని ప్రయత్నించారు డాక్టరుగారు.

"వద్దు మేస్టారూ! ఆ బిడ్డను చూసుకుంటూ నా లత ఎలా మురిసిపోతూందో చూడాలని నా ఆశ! నే నడవగలను మేస్టారూ. ఊత ఇవ్వండి చాలు! ఆలస్యం చేయకండి!"

అతని భావాల, లోతులెరిగిన ప్రిన్సిపాల్‌గారు కంటతడి పెట్టారు. చేసేదిలేక అతన్ని అటువైపు నడిపించారు.

ఆశగా అటువైపు చూస్తున్నాడు మోహన్!! పురిటిగది వాసన! దానికోసం ఎన్నాళ్లగానో తను ఎదురుచూశాడు!

కొట్టినపాములా చలనం లేకుండా పడుకున్న లత పక్క, ఆ అందాలపాప కేరింతలు కొడుతున్నాడు!

ఆమె మంచం దగ్గిరికి వెళ్లాడు మోహన్. అక్కడున్న లేడీడాక్టర్‌కూడా అతన్ని వారించలేకపోయింది.

మెల్లిగా కళ్లు తెరిచింది లత!

అందరూ ఆశ్చర్యపోయారు!

మోహన్‌ని గుర్తు పట్టింది. పేలవంగా నవ్వింది. అతికష్టంపై పక్కకి తిరిగి, తృప్తిగా తన పాపను చూసుకుంది. మోహన్‌కళ్లల్లోకి చూసింది.

"ప్రిన్సిపాల్‌గారేరీ?" ఒక చేతిని మోహన్‌చేతుల్లో పెడుతూ అడిగింది.

ప్రిన్సిపాల్‌గారు మంచం దగ్గిరికి వచ్చారు.

"మీ కళాభిమానానికి నా జోహార్లు. నా బాబు మాత్రం కళాకారుడవ్వకుండా చూడండి. కళాకారుల కష్టాలు నా బాబు అనుభవించవద్దు. సుఖంగా అందరిలాగే నా బాబు నూరేళ్లు బ్రతకాలి!"

దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు ప్రిన్సిపాల్‌గారు! మోహన్‌కళ్లల్లోకి చూసింది లత!

"మనిద్దరికీ మధ్య ఏ దాపరికాలూ ఉండకూడదని ప్రమాణాలు చేసుకున్నాం. మీ రోగం విషయంలో మీరా ప్రమాణాన్ని ఉల్లంఘించారు. అయినా భగవంతుడు మంచివాడు. మీ మనోవ్యథని, మీ రోగాన్ని అర్థంచేసుకోగలిగే అవకాశం నా కిచ్చాడు. మీరు రాసుకున్న కాగితాలన్నీ నే చూశాను. నా తప్పును క్షమించండి. నా నుదుటి బొట్టుకోసం కళని దూషించబోయారు మీరు. అది నే సహించలేను. అందుకే మీ కంటే ముందు వెళుతున్నాను. వెంటనే ఆ నవల పూర్తిచెయ్యండి. కళారాధకుల కంకితం ఇవ్వండి! బాబును చూసుకునే భాగ్యం మీకైనా దేవుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ఇక సెలవు. . . మోహన్. . ." బాధగా అతనిచేతిని నొక్కింది. మరేమీ మాట్లాడకుండా కన్ను మూసింది.

పక్కలోని పిల్లాడు విలవిలా ఏడ్చాడు. ఆశ్రమం అంతా కల్లోలమైపోయింది!



శిలాసుందరి

ఫోటో—ఎస్. జయరామిరెడ్డి (నర్సరావుపేట)

'చావుతెలివి అంటారు. ఇదేలాగుంది' అనుకున్నారు ప్రిన్సిపాల్‌గారు. ఒక్కక్షణం క్రితం ఆమెను చూసి ఆమె బ్రతుకుతుందని ఆశ పడ్డారు.

* * *

ఒంటరిగా మంచంమీద కూర్చున్నాడు మోహన్. ఏడవడానికికూడా అతని కళ్లల్లో నీరు లేదు!

కళపేరు చెప్పి తను సృష్టించిన ఎన్నో పాత్రల జీవితాలను దుఃఖాంతం చేశాడు. అలా చెయ్యడం వల్లనే తను సాహిత్యరంగంలో ఒక ప్రత్యేక స్థానం ఆక్రమించుకున్నాడు! ఆ రోజుల్లో తనకు తెలియలేదు తన పాత్రలకు తనెంతో ద్రోహం చేస్తున్నాడని కథాగమనం కోసం ఎందర్నో అర్ధాయుష్కులుగా హత మార్చాడు! అలా చెయ్యవద్దని లత తను నెన్నోసార్లు బతిమాలుకుందికూడా! ఆ విషయంలో మాత్రం ఆమె మాటల్ని తోసిపుచ్చేడు. ఆ పాపఫలితమేనేమో ఇదంతా!

తను చేసిన ప్రతి పనికీ లత అండగా నిలిచింది. ఆమె ఎన్నో విషయాల్లో తనకు ధైర్యం చెప్పింది. అలాగే చావువిషయంలోకూడా అతనికి భయం లేకుండా చేసింది. 'చావడం మీరనుకున్నంత కష్టం కాదు, చాలా తేలిక' అన్నట్టుగా సునాయాసంగా చచ్చిపోయింది. ఆదర్శమైనస్త్రీ ఏ పనిచేసినా అది ఆదర్శంగా మారుతుందేమో!

లత చెప్పిన మాటలు, చచ్చిపోడానికికూడా తన కెంతో ధైర్యాన్నిస్తున్నాయి ఆ మాటలన్నీ ఆమె ప్రకృతి ఆశ్రమానికి వచ్చాక నేర్చుకుంది. "చచ్చిపోయేది మనం కాదు. మన శరీరం! మన ఆత్మలకు చావులేదు. శరీరం పంచభూతాలతోనూ తయారుచేయబడింది. గాలి, నీరు, అగ్ని, వెలుగు, భూమి వీటన్నిటినుండి తయారయిన శరీరం వీటిల్లో ఏదోనాటికి ఎలాగా, కలిసిపోతుంది. ఆత్మ వీటన్నిటికీ పైనవుంది. అదే సత్యం, అదే శివం, అదే సుందరం! మన లక్ష్యాలు సిద్ధించినప్పుడే దానికి శాంతి లభిస్తుంది!"

ఎంతో అలజడిగా ఉన్న ఆశ్రమంతో తనకు సంబంధం లేదనుకుంటూ తన గదితలుపులు మూసుకున్నాడు మోహన్. తలగడకిందనుండి కాగితాలూ కలం తీశాడు.

గుండెల్లో భరించరాని నొప్పి! !

అతని కలాన్ని ఆ నొప్పి ఆపలేకపోయింది!

పూర్తిఅయిన నవలవైపు తృప్తిగా చూసుకున్నాడు.

తలుపు తెరుచుకుని ఎవరో లోపలికి వచ్చారు!

అటుపైన ఏ మయిందో అతనికి తెలీదు! !

● ● ●

ఉయ్యాలలో అమాయికంగా ఆడుకుంటున్న బాబు తుళ్లిపడ్డాడు. తను కార్చినకన్నీళ్లు బాబుమీద పడ్డాయని గ్రహించిన ప్రిన్సిపాల్‌గారు, అప్రయత్నంగా ఆ బాబుమీద చెయ్యి వేశారు!

ఏమిటో ఈ అనుబంధం!

సంసారసాగరానికి స్వస్తిచెప్పి, కళారాధన కోసం డబ్బంతా ఖర్చుపెట్టిన తను ఈ అరవయ్యోపడిలో ఈ బుల్లిబుజ్జాయి ప్రేమబంధంలో చిక్కుకున్నాడు!

పరమాత్ముని లీల ఇలాగే ఉంటాయి!

ఆ చిట్టితండ్రి నిర్మలంగా చూస్తున్నాడు. ఆ బాబు కళ్లల్లోకి పరీక్షగా చూశారు ప్రిన్సిపాల్‌గారు. మోహన్‌చెప్పిన కడపటిమాటలు మళ్లీ ఓసారి జ్ఞాపకం వచ్చాయి.

'మేస్టారూ! ఆ రాధామాధవుల ప్రణయగానం ఈ ప్రపంచంలో అన్నివేళలా వినిపిస్తుంది, అన్ని చోట్లా కనిపిస్తుంది! నా బాబు కళ్లల్లోకి చూడండి. ఓ కంట్లో నేనూ, మరోకంట్లో నా లతా కనిపించడం లేదూ? నా లతా, ఆమె వెనక, నేనూ ఈ రోజే పోయినా, నా బాబుకళ్లల్లో మేమిద్దరం ఆరనిదీపాలుగా ఉండిపోమూ?' ★